## ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బన్సీలాల్‌పేటలో ఇండ్లలోకి ప్రవేశించిన వర్షం నీరు

బేగంపేట్, ఏప్రిల్ 4: నగరంలో కురిసిన భారీ ఆకాల వర్షంతో సనత్నగర్ నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలు అతలాకుతలంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో అధికారులు తక్షణ చర్యలు చేపట్టి స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మాజీ మంత్రి సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ ఆదేశించారు. బేగంపేట్, బన్సీలాల్పేట్, మోండా ప్రాంతాల్లోని ఇండ్లలోకి వర్షం నీరు చేరింది. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముందస్తు ప్లానింగ్‌తో మరోసారి నీరు చేరకుండా చూడాలని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

### గానసభలో గణపతి మందిరం ప్రారంభం

ముషీరాబాద్, ఏప్రిల్ 4: త్యాగరాయ గానసభ ఆవరణలో అభయ గణపతి మంది ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ సహకారంతో నిర్మితమైన మందిరాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కృష్ణ శిలతో రూపుదిద్దుకున్న గణనాథుని విగ్రహాన్ని గానసభ అధ్యక్షుడు వి ఎస్ కళా జనార్దన మూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గాన సభ ప్రధాన కార్యదర్శి కళా శారద, కళా పద్మ నీలిమ, ఎంకె రాము, రామరాజు, సూర్య ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు సమిష్టి కృషి

- గులాబీ పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం
- కేసీఆర్‌ను కలిసిన కంటోన్మెంట్ నేతలు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ నేత నివేదిత సాయన్న



తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్, తదితరులు

కంటోన్మెంట్/బొల్లారం, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న సభపై శుక్రవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో పాటు నగరానికి చెందిన పార్టీ నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 3 గంటల వరకు చేరుకోవాలని సూచించారు. జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ, ఇతర వాహనాలను ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. వేడుకలు అంబరాన్ని అంటేలా నిర్వహించాలని, సభకు తరలే ముందు ప్రతి డివిజన్, వార్డుల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. రజతోత్సవ సభ తర్వాత కొత్త సభ్యత్వాలు ఉంటాయని, కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, కమిటీల ఎన్నిక ఉంటుందని వెల్లడించారు. ఈ సమేవేశానికి కంటోన్మెంట్ నియోజకవర్గ పార్టీ నేతలు నివేదిత సాయన్న, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ

## ఎమ్మెల్యేకు సీతారాముల కల్యాణ ఆహ్వానం



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానం పలుకుతున్న కార్పొరేటర్ లక్ష్మి, బాల్‌రెడ్డి ప్రతినిధులు

బేగంపేట్, ఏప్రిల్ 4: సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు సనత్ నగర్ హనుమాన్ ఆలయ పండితులు కార్పొరేటర్ కొలన్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆహ్వానించారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ నెల 6 న నిర్వహించే కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదం అందజేశారు. అదేవిధంగా జెక్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సుబ్బరాజు, సురేష్ గౌడ్ తమ కాలనీలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించారు. అదేవిధంగా మోండా డివిజన్ లోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించే కల్యాణ మహోత్సవానికి ఆలయ ఈవో అన్నారావు ఆధ్వర్యంలో ఆహ్వానించారు.

## ప్రభుత్వ స్కూళ్లను ప్రోత్సహించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

అడ్డగుట్ట, ఏప్రిల్ 4: ప్రభుత్వ స్కూళ్లను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. చిలకలగూడ దూద్‌బావిలోని ప్రాథమిక పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరానికి ప్రవేశాల కరపత్రాలను మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతతో కలిసి శుక్రవారం ఆయన తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌లో విద్యార్థులకు ఉపకరించేలా జూనియర్, డిగ్రీ కాలేజీలను సాధించుకున్నామని పేర్కొన్నారు. కొత్త భవనాల నిర్మాణానికి సైతం చురుకుగా ఏర్పాట్లు జరుపుతున్నామని అన్నారు. ఉపాధ్యాయులు సైతం తమ తమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్

ముషీరాబాద్, ఏప్రిల్ 4: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ముగిసింది. వారం రోజులపాటు మేడ్చల్ మండలం నూతనకల్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఓ.పద్మజ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ క్యాంప్‌లో పాల్గొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చెట్ల ఆవశ్యకతను నినాదాల రూపంలో గ్రామ ప్రజలకు తెలియజేయడమే కాకుండా స్వయంగా మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకం, డ్రగ్స్ వలన సమాజానికి జరుగుతున్న నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు ఎన్ఎస్ఎస్ బృందాన్ని అభినందించారు. విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా తయారు అయినప్పుడే బాధ్యతగల సమాజం, దేశం తయారవుతుందని ఆయన పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓ.పద్మజ

## పద్మ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే



పద్మ కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 4: అడిక్ మెట్ డివిజన్ పద్మకాలనీలో శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. వరద నీరు చేరడంతో కాలనీ జలమయమైంది. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. మునుముందు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నాలా వర్క్స్ పూర్తి అయ్యాయని, త్వరలో వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, కడప సురేందర్, అబ్బ, యూనిస్, రితేష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులు బస్‌షెల్టర్లను ఉపయోగించుకోవాలి



బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధుబాబు

బొల్లారం, ఏప్రిల్ 4: కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను శుక్రవారం నార్త్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధుబాబుతో కలిసి ప్రారంభించారు. అదనపు డీసీపీ మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ ఎంతో ఉపయోగకారంగా ఉంటుందని అన్నారు. బస్ షెల్టర్లలోనే ప్రయాణికులు ఉండాలని, రోడ్డుపై నిలుచోకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధుల కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, హకీంపేట్ బస్‌డిపో మేనేజర్ భవభూతి, ఫౌండేషన్ ఫౌండర్ రఘువంశీ, కోఫౌండర్ రాఘ వైష్ణవి, కిరణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 4: పద్మారావు నగర్ హమాలీబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. తద్వారా ఆరోగ్యవంతులైన పిల్లలు జన్మనిస్తారని అన్నారు. క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తూ వారి సూచనలు పాటించాలని కోరారు. అంగన్ వాడీ టీచర్లు కుల్సుం, జానకి, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దాడి విషయంపై అడిగినందుకే నిరసన

బొల్లారం, ఏప్రిల్ 4: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టర్ చరణ్ తేజ్‌పై బోయిన్‌పల్లి మార్కెట్ వర్తక వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు దాడి చేయడాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కారు పార్కింగ్ విషయంలో చరణ్‌పై సామ దేవేందర్‌రెడ్డి దాడి చేసిన విషయాన్ని బాధితుడు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని పరిష్కరించే క్రమంలో దేవేందర్‌రెడ్డి తనతో దురుసుగా ప్రవర్తించారని చైర్మన్ తెలిపారు. చరణ్‌పై దాడికి పాల్పడడమే కాకుండా తన పట్ల అమర్యాదగా వ్యవహరించిన దేవేందర్‌రెడ్డిపై తిరుమలగిరి పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తప్పించుకునేందుకు వర్తక వ్యాపారుల అసోసియేషన్‌కు విషయాన్ని అంటగడుతున్నారని తెలిపారు. మార్కెట్లో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించి నోటీసులు జారీ చేసినందుకే గొడవలకు తెర లేపుతున్నారని స్పష్టం చేశారు.

### వ్యాపారుల నిరసన..

బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ మార్కెట్ యార్డు వ్యాపారస్తులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. గత కొన్నేళ్లుగా మార్కెట్లో వ్యాపారం నిర్వహిస్తున్న తమ పట్ల చైర్మన్ వైఖరి నిరసిస్తూ ఆందోళనకు దిగారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు గంటపాటు మార్కెట్లో క్రయ విక్రయాలు నిలిపివేశారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన కార్యాలయం ఎదుట శాంతియుత ప్రదర్శన చేపట్టారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో బంద్‌కు పిలుపిస్తామని హెచ్చరించారు. మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

## డ్రైనేజీ పైపులైన్ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, ఏప్రిల్ 4: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. డివిజన్లోని స్కైలాబ్ హోటల్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్లో నెలకొన్న అపరిష్కృత సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఆమె అన్నారు.

## పండుగలు అనుబంధాలను పెంపొందిస్తాయి



ఈద్ మిలాప్‌లో మాజీ కార్పొరేటర్ శేషు కుమారితో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు

అమీర్పేట్ మార్చి 4: పండుగలు మనుషుల మధ్య చక్కటి అనుబంధాలను పెంచేవిగా ఉండాలని మాజీ కార్పొరేటర్ ఎన్ శేషు కుమారి పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ సికిందర్‌బాబా ఆధ్వర్యంలో సనత్‌నగర్ డీవీఎమ్ కాలనీలో జరిగిన ఈద్ మిలాప్‌లో సనత్‌నగర్ సీఐ శ్రీనివాసులుతో కలిసి పాల్గొన్నారు. సనత్‌నగర్ ఎస్ఐ హరీష్, జామా మసీద్ జాఫ్రీ అధ్యక్షులు సయ్యద్ నుమానుద్దీన్, ఎంఐఎం సనత్ నగర్ ఇంచార్జ్ మహమ్మద్ షౌకత్, డీఎన్ఎంకాలనీ అధ్యక్షులు మీర్జా జమీర్‌బేగ్, అలంగిర్ మసీద్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రియాజుద్దీన్, మహమ్మద్ గఫార్, మహమ్మద్ అప్సర్ పాల్గొన్నారు.



కంటోన్మెంట్ ఆరో వార్డ్ ఏడబ్ల్యుహెచ్ఓ కాలనీలో శుక్రవారం స్ఫటిక బాన దక్షిణ కేదార్నాథ్ మందిర ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు లక్ష్మినారాయణ, రమణారావు, చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం, ఏప్రిల్ 4:

## అభివృద్ధిలో కుల సంఘాల భాగస్వామ్యం అవసరం

కవాడిగూడ, ఏప్రిల్ 4: భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం నూతన అధ్యక్షుడిగా కాడబోయిన కొండల్ నియమితులయ్యారు. శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొండల్ ఎమ్మెల్యేకు నూతన కమిటీని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల సంఘాలు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలన్నారు. అభివృద్ధి పనుల్లో నూతన కమిటీ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సంఘం సభ్యులంతా ఐక్యంగా పనిచేయాలని, సంఘాన్ని పటిష్టం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. భోలక్‌పూర్ మహిళా కమిటీ అధ్యక్షురాలు గంగ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవింద్‌రాజ్, బాబూరావు, సంఘం నాయకులు స్వప్న, రాధిక, సరిత, కవిత, పద్మ, అశోక్, గోపాల్, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం



సుకుమార్ దాస్

చిక్కడపల్లి, ఏప్రిల్ 4: వృద్ధుడు అదృష్టమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ చోటు చేసుకుంది ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుకుమార్ దాస్ (77) అశోక్‌నగర్‌లోని మనమరాలింటికి వచ్చాడు. చాయ్ తాగి వస్తానని చెప్పి బయటికి వెళ్లి తిరిగి రాలేదు, అతనికి హైదరాబాద్ కొత్త కావడంతో దారి మర్చిపోయి ఉండొచ్చు అని భావిస్తున్నా రు. అతనికి బెంగాలీ భాష మాత్రమే తెలుసని వివరాలు తెలిసినవారు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో తెలుపాలని కోరారు.

## ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణ

కవాడిగూడ, ఏప్రిల్ 4: ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నూతనంగా పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. శిక్షణలో వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకొని ఇక్కడ నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ప్రసాద్, డిస్టిక్ రిసోర్స్ పర్సన్ లు లక్ష్మిపతి, శ్రీనాథ్ శర్మ, బాలరాజు, జ్యతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

అడ్డగుట్ట, ఏప్రిల్ 4: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 3న రాత్రి 11 గంటల సమయంలో తుకారం గేట్ ప్రధాన రహదారిలోని యుక్తి టిఫిన్స్ ఎదురుగా సుమారు 32 సంవత్సరాల వయస్సు గల యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న తుకారం గేట్ పోలీసులు సదరు యువకుడిని పరిశీలించగా అతను అతిగా మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. దీంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### హుస్సేన్‌సాగర్ నీటిలో..

బేగంపేట్: హుస్సేన్‌సాగర్ నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని సెక్రటరియట్ పోలీసులు గుర్తించారు. ఎస్ఐ హనుమంతు వివరాల ప్రకారం.. శుక్రవారం ట్యాంక్ బండ్ లేపాక్షి సమీపంలో నీటిలో ఉన్న మృతదేహాన్ని ఎస్ఐ వెలికి తీయించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుని ఒంటిపై గోదుమ రంగు ఫార్మల్ ప్యాంట్, ఉదా రంగు షర్టు ఉందని, మృతుని వయస్సు సుమారుగా 55 ఏండ్లు ఉంటాడని తెలిపారు. మృతునికి సంబంధించిన బంధుమిత్రులు సెక్రటేరియట్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## మహా కుంభాభిషేకాల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మారేడ్ పల్లి, ఏప్రిల్ 4: మోండా డివిజన్ శివాజీనగర్‌లోని పెరుమాళ్ వెంకటేశ్వర ఆలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు మహా కుంభాభిషేక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వై.నర్సారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఈవో సత్యమూర్తి, సభ్యులతో కలిసి ఆయన ఉత్సవాల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నరేందర్‌రెడ్డి, నరేష్ , సురేష్ కుమార్, రాయి వెంకటేష్, గోవిందన్, అంజనేయులు, అర్చకులు మనీ వన్నన్, సారధి తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రో హోమియోపతితో వ్యాధులకు చెక్

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 4: ఎలక్ట్రోహోమియోపతి వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు అద్భుతమైన చికిత్స అందిస్తున్నామని తెలంగాణ ఎలక్ట్రోహోమియోపతి వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.గంగాధర్ అన్నారు. ఎలక్ట్రో ఆవిష్కర్త డాక్టర్ కౌంట్ సీజర్ మాటి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తమ వైద్య విధానానికి క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నామని అన్నారు. సమాజంలోని పేదలకు దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందిస్తూ వైద్యులుగా తాము ప్రజల నుండి మన్నలను పొందుతున్నామని అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యుల సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఈశ్వర్‌కుమార్, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్‌బాబు, కోశాధికారి డాక్టర్ విజయకుమార్, ప్రతినిధులు డాక్టర్ రబ్బాని, డాక్టర్ హుస్సేన్ భాష, డాక్టర్ నరసింహ, డాక్టర్ శంకర్ గౌడ్, డాక్టర్ వసీఉద్దీన్, డాక్టర్ ఫోర్కాన్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రవీందర్, డాక్టర్ అశ్విని పాల్గొన్నారు

## వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, మార్చి 4: వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వడ్డెర్ల లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు జేరిపేట సత్యనారాయణ, తెలంగాణ వడ్డెర (గన్ను దెబ్బ) సంఘం అధ్యక్షుడు ఎత్తిరి అంతయ్య అన్నారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను వారు కలిసి వడ్డెరల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో జేసీబీలపై పోలీసులు చాలానాలను అధికంగా విధిస్తున్నారని తెలిపారు. దీంతో వడ్డెరలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వడ్డెరలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు